క్లుప్తంగా

నేడు చౌడేశ్వరీ దేవి జయంతి ఉత్సవాలు

కొడంగల్: పట్టణ శివారులో వెలిసిన నందవరం చౌడేశ్వరీ దేవి జయంతి ఉత్సవాలు సోమవారం జరగనున్నట్లు నిర్వాహకులు సంకారపు పవన్ కుమార్, శివకుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకం, అమ్మవారికి అలంకరణ, ప్రత్యేక పూజ మహా మంగళ హారతి ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 7 గంటలకు భజన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

ప్రజావాణిని వినియోగించుకోవాలి

బంట్వారం: రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అష్ఫక్ రసూల్ ఆదివారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ధరణికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే.. కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని, సమస్యలపై రైతులకు వివరించి అవసరమైన వారికి అక్కడికక్కడే మీ సేవా కేంద్రంలో దరఖాస్తు పెట్టిస్తామని వెల్లడించారు.

రూ.1.40లక్షలు ఆర్థిక సాయం



అశోక్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

తాండూరు టౌన్: గుండెపోటుతో మృతిచెందిన ఫొటోగ్రాఫర్ అశోక్ కుటుంబానికి అండగా ఉంటామని తాండూరు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సభ్యులు అశోక్ భార్య భారతమ్మకు ఆదివారం రూ.1.40 లక్షలను ఆర్థిక సహాయంగా అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు శరణు, కిషోర్, షాబుద్దీన్, అంబదాస్, హీరాలాల్, రాఘవేందర్, నాగప్ప, వీరన్న, భాస్కర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు మేలు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పరిగి: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగి మండలం చిట్యాల, యాబాజిగూడ గ్రామాలకు చెందిన నర్సింహులు, రాజు అనారోగ్యానికి గురయ్యారు. ఆర్థిక సాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. సీఎం సహాయ నిధి పేదలకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అవినీతి పాలనను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమార్

దౌల్తాబాద్: కేసీఆర్ అవినీతి పాలనను ప్రజలకు చెప్పాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం పార్టీ ఆదేశాల మేరకు స్థానిక చెరువుకట్టపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రధాని మోదీ పాలనలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పున్నంచంద్ లాహోటీ, మదన్, బస్వరాజు, కూర వెంకటయ్య, నర్సింహులు, సతీష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఉత్సవాలు

కుల్కచర్ల: అంతారంలో ఆదివారం దుర్గాదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పొలిమేర చుట్టూ పొలి చల్లి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. సనాతన ధర్మాలను ఆచరిస్తూ, సంస్కృతి సంప్రదాయాలను అనుసరించి గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు.

పచ్చిరొట్ట.. పంటకు పోషణ

- జీలుగ, జనుము సాగుతో పెరగనున్న భూసారం
- తగ్గనున్న రసాయన ఎరువుల వాడకం
- అధిక దిగుబడులతో అన్నదాతలకు లాభం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



పచ్చిరొట్ట సాగును పరిశీలిస్తున్న ఏఓలు (ఫైల్)

దోమ: పచ్చిరొట్ట సాగు నేలలకు రక్షణతో పాటు.. రైతులకు లాభం చేకూరుస్తుంది. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుమును పండించినట్లయితే భూసారం పెరిగి.. అధిక దిగుబడులు పొందేందుకు దోహదపడుతుంది. వానాకాలం సీజన్ రాకముందే పచ్చిరొట్టను సాగు చేసుకుంటే.. పంటలకు ఎంతగానో మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

కలుపును నిలువరిస్తుంది..

మండలంలో రైతులు ఎక్కువగా వరి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆ తర్వాత పత్తి, మొక్కజొన్న, కంది పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌కు ముందే.. మండల వ్యవసాయ కార్యాలయం నుంచి అధికారుల సూచనల మేరకు 87 క్వింటాళ్ల జనుము, 190 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను దాదాపూర్, దిర్సంపల్లి, మల్లేపల్లి, మోత్కూర్, దోమ, బొంపల్లి, బాస్‌పల్లి, పాలేపల్లి, రాకొండ తదితర గ్రామాలకు చెందిన 277 మంది రైతులు రాయితీ ద్వారా కొనుగోలు చేసి సాగు చేశారు. ఎక్కువగా వరి పండించే రైతులు ముందుగా పంట పొలాల్లో జీలుగ విత్తనాలు విత్తారు. 40 రోజుల తర్వాత ఏపుగా పెరగడంతో దుక్కిలో కలియదున్నుతారు. ఆ తర్వాత భూమిలో భూసారం పెరిగి, పంటల దిగుబడి పెరిగేందుకు దోహదపడుతుంది. పంటలు చీడపురుగుల బారిన పడకుండా కాపాడుతుంది. భూమిలోని సూక్ష్మపోషకాలైన భాస్వరం, గంధకాలు వినియోగంలోకి వచ్చి చౌడు నేలలు సారవంతంగా మారుతాయి. భూమి గుల్లగా మారి నీరు నెలలోకి ఇంకే గుణం పెరిగి, కలుపును నిలువరిస్తుంది.

ఎకరాకు 12 నుంచి 15 కిలోలు

పచ్చిరొట్టగా జీలుగ, చౌడు నేలలు, వరి సాగు చేసే భూములకు ఎక్కువగా అనుకూలంగా ఉంటుంది. జీలుగను ఎకరానికి 12 నుంచి 15 కిలోలు వినియోగిస్తే 8 నుంచి 10 టన్నులు పచ్చిరొట్ట తయారవుతుంది. దీంతో 6 కిలోల నత్రజనితో పాటు 2 కిలోల భాస్వరం, 5 కిలోల పొటాష్ పంటకు అందుతుంది. జనుములు అన్ని రకాల నేలలో సాగు చేయడానికి వీలుంటుంది. ఎకరానికి 12 నుంచి 15 కిలోలు చల్లుకోవాలి. పూత దశలో వాటిని కలియదున్నాలి. ఇవి ఎకరానికి సుమారు 4 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో 7కిలోల నత్రజని ఒక కిలో భాస్వరం, 5 కిలోల పొటాష్ పంటలకు అందుతుంది. అందుకోసం రైతులు రసాయన ఎరువులను తగ్గించి జీలుగ, జనుము విత్తనాలను సాగు భూముల్లో విత్తుకున్నట్లయితే పంటకు పుష్టి లభించడంతో పాటు అధిక దిగుబడులు పొందే వీలుంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడి పెరిగింది



వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎనిమిది ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నా. యేటా జీలుగ, జనుము విత్తనాలు విత్తి, ఏపుగా పెరిగిన తరువాత కలియదున్నుతున్నా. దీంతో పంట భూముల్లో భూసారం పెరిగి, రసాయన ఎరువుల కంటే మెరుగైన ఫలితాలను ఇస్తోంది. అధిక దిగుబడి వస్తోంది.

– గాల్ల నాగమణి, రైతు, దిర్సంపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



జీలుగ, జనుము విత్తనాలు రాగానే రైతులకు సమాచారం ఇస్తున్నాం. అవసరమైన రైతులు తీసుకెళ్లి, సాగు చేసి పొలాల్లో కలియదున్నుతున్నారు. దీంతో ఆశించిన దిగుబడులను పొందుతున్నారు. జీలుగ, జనుములపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ సాగు చేసుకోవాలని సూచిస్తున్నాం.

– దుర్గప్రసన్న, ఏఈఓ, శివారెడ్డిపల్లి క్లస్టర్

నేలలకు ప్రయోజనం



పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంచుకోవడంతో పాటు, రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చు. వరి పండించే రైతులు ఈ విత్తనాలను విత్తుకుంటే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంది. వానాకాలం రాక ముందే ఈ పంటలను సాగు చేయాలి. అనంతరం 40 రోజుల తర్వాత పొలాల్లో కలియదున్నాలి. దీంతో భూమిలో భూసారం పెరిగి, దిగుబడి పెంచేందుకు దోహదపడుతుంది.

– ప్రభాకర్ రావు, వ్యవసాయ అధికారి, దోమ

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

అనంతగిరి: సమస్యలు పరిష్కరించే వరకు జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. సమ్మెలో భాగంగా ఆదివారం గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. చాలీ చాలని వేతనాలతో కార్మికుల జీవనం దుర్భరంగా ఉందని చెప్పారు. కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజయ్య, బుచ్చయ్య, హసన్, నర్సింహులు, రాములు, కృష్ణయ్య, పాండు, వీరేందర్, లక్ష్మణ్, బోనయ్య, బాలరాజు, గోపాల్ పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

పూడూరు: జీపీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. కార్మికుల నిరవధిక సమ్మె ఆదివారానికి 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. మల్టీపర్పస్ విధానం రద్దుచేసి, కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం 19, 500 చెల్లించాలని కోరారు. కార్మికులు ముజాహిద్, ఖాజ, బందయ్య, వెంకటయ్య, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.



పూడూరు: దీక్షా శిబిరంలో కార్మికులు

ఆసరా లేని కుటుంబాలకు చేయూత



ఆర్థిక సాయం పొందిన చిన్నారులతో రామకృష్ణ సేవా సమితి సభ్యులు

కొడంగల్/ కొడంగల్ రూరల్: ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి.. ఆసరా కోసం ఎదురు చూస్తున్న ఐదు కుటుంబాలకు తెలంగాణ విద్యా వంతుల వేదిక ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ సేవా సమితీ ఆదివారం ఆర్థిక సాయం అందజేసి పెద్ద మనసు చాటుకుంది. విద్యా వంతుల వేదిక.. అనాథ పిల్లలను గుర్తించి, ప్రోత్సాహం అందించేందుకు సేవా సమితి సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో నియోజకవర్గంలోని టేకుల్‌కోడ్, హస్నాబాద్, కొండారెడ్డిపల్లి, కొడంగల్, బషీరాబాద్ గ్రామాల్లోని పిల్లలకు సమితి సభ్యులు ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున 25వేలతో పాటు, కొడంగల్ మండలం అన్నారం సర్పంచ్ అనిత రూ.5వేలను కలిపి మొత్తం రూ.30వేలను 5 కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమని, చేయూతనందుకున్న విద్యార్థులకు కొంత మేలు జరుగుతుందన్నారు. సమితీ సభ్యులు బస్వరాజ్, బాలకృష్ణ, వెంకన్న, మోహన్‌రెడ్డి, తెలంగాణ విద్యావంతుల వేదిక సభ్యుడు రవీందర్, ఎంఈఓ రాంరెడ్డి, బాకారం శేఖర్, ప్రవీణ్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

అర్ధాకలితో అలమటిస్తున్నాం..



నిరసన తెలుపుతున్న సిబ్బంది, చిరు వ్యాపారులు

ధారూరు: ఏడు నెలలుగా ఉపాధి లేక, కుటుంబాల పోషణ భారమై అర్ధాకలితో అలమటిస్తున్నామని కోట్‌పల్లి ప్రాజెక్టు బోటింగ్ సిబ్బంది, చిరు వ్యాపారులు.. ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడారు. ప్రాజెక్టు వద్ద పర్యాటలకు తినుబండారాలు విక్రయించి, బోటింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నామని, పర్యాటకుల సందర్శన నిలిపివేయడంతో జీవనోపాధి కష్టమైందని వాపోయారు. పదిహేనేళ్లుగా ప్రాజెక్టును నమ్ముకొని బతుకుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పర్యాటకుల రాకను పునరుద్ధరించి తమకు ఉపాధి కల్పించాలని కోరారు.

ఆషాఢమాస సంబురాలు

తాండూరు టౌన్: బీజేపీ కౌన్సిలర్ సాహు శ్రీలత ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢమాస సంబురాలు వైభవంగా జరిగాయి. పోచమ్మకు బోనాలు సమర్పించి, పలు సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోయారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడారు. నేటి యువతకు సంప్రదాయ పండుగల ప్రాముఖ్యత గురించి తెలియ చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. బీజేపీ కౌన్సిలర్ బాలప్పతో పాటు చంద్రకళ, సరిత, శశికళ, శ్రీదేవి, కవిత, శ్రీదేవి, సరోజ, నాగమణి, రాణి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో ప్రజాప్రతినిధులు, ముదిరాజ్‌లు

కొడంగల్: పెద్దమ్మ తల్లి పలహారం బండి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మున్సిపల్ రెండోవార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముదిగండ్ల కృష్ణ, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

యాలాల: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని పగిడియాల సర్పంచ్ బసిరెడ్డి అన్నారు. ఆదివారం గీత సత్సంగ్ సమితి తాండూరు వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు. శిబిరంలో గ్రామస్తులు, మహిళలు, వృద్ధులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్యులు వారికి అవసరమైన పంపిణీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఉపేంద్ర, రాకేష్, ప్రకాష్, కిషోర్, గీత సత్సంగ్ సమితి సభ్యులు నారాయణ, కృష్ణయ్య, రమేష్, శివకుమార్, బిచ్చయ్య, నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, గ్రామపెద్దలు మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో కర్రె బాలమణి అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ స్థానిక నేతలతో ఆదివారం బాధిత కుటుంబీకులకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామస్వామి, అంజి, శేఖర్, దస్తగిరి, గోరేపాష, రామస్వామి, కృష్ణ, పవన్, నరేష్, మల్కయ్య, శశి పాల్గొన్నారు.

రైతుల హర్షం



చిట్లపల్లి వాగులో నీటి ప్రవాహం

కొడంగల్ రూరల్: రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. తడి లేని భూముల్లో విత్తిన విత్తనాలు, కురుస్తున్న వర్షాలతో మొలకెత్తాయని, వాటితో పాటే కలుపు పెరుగుతుందని పేర్కొంటున్నారు. భూములు ఆరితేనె కలుపు తీయడం సాధ్యమవుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా.. చిట్లపల్లి, పోచమ్మతండా, మైసమ్మతండాల మధ్య గల వాగుల్లో నీటి ప్రవాహం కొనసాగుతోంది.



యాలాల: బోనాల ఊరేగింపు



పరిగిలో.. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కొడంగల్ రూరల్: బూల్కాపూర్‌లో..

చల్లంగ చూడు తల్లీ..

బోనాల సంబురాలు అంబరాన్నంటాయి. ఆషాఢమాసం సందర్భంగా ఊరూరా జరిగిన ఉత్సవాల్లో గ్రామస్తులు నెత్తిన బోనంతో.. డప్పు చప్పుళ్ల నడుమ, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా గ్రామ దేవతల సన్నిధికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక వర్షాలు కురిసి, పాడిపంటలతో పల్లెలు పచ్చగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో చల్లంగ ఉండేలా చూడు తల్లీ అని భక్తులు వేడుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: ఇంద్రానగర్‌లో బోనమెత్తిన సతీమణి, కూతురుతో ఎమ్మెల్యే ఆనంద్



ధారూరు: మైసమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు



తాండూరు టౌన్: కాళికాదేవికి బోనం సమర్పిస్తున్న భక్తులు



ధారూరులో..



మర్పల్లి: బోనంతో ఊరడమ్మ చెంతకు



దోమ: ఊరడమ్మ దేవి సన్నిధిలో పోతురాజుల విన్యాసాలు

పూర్ణాహుతి



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

కొడంగల్: శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం రాత్రి హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. నిత్యం జరిగే కైంకర్యాల్లో మంత్రలోపం, క్రియాలోపం, ద్రవ్యలోపం దోష నివారణ కోసం మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా జరిపించారు. మహా పూర్ణాహుతి, కుంభ బింబ ప్రదక్షిణం, ప్రోక్షణ, అక్షతారోపణం తదితర కార్యక్రమాలతో ముగించారు.

శివాలయంలో బిల్వార్చన



పూజలు చేస్తున్న అర్చకుడు

కొడంగల్: గాడిబాయి శివాలయంలో ఆదివారం మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం, బిల్వార్చన, అలంకరణ చేశారు. హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. అర్చకుడు కిట్టు స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా అమ్మవారి జాతర

మోమిన్‌పేట: దుర్గంచెర్వు, చంద్రాయన్‌పల్లిలో అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా చివరి రోజు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు హరిశంకర్, అంజయ్య, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.